సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం ; 6 ; జూన్ ; 2023



కేజీబీవీల్లో బదిలీల జాతర

కేజీబీవీల్లో బదిలీల జాతర జరుగుతోంది. 12న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

- 8లో



సమస్యలు పరిష్కరించండి

విద్యుత్ శాఖ సీఎండీ పృథ్వీతేజ్ జిల్లాలో పర్యటించారు. సమస్యలపై ఆరా తీశారు.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	37°	26°
ఇచ్ఛాపురం	38°	27°
పాతపట్నం	38°	25°
శ్రీకాకుళం	38°	25°

న్యూస్‌రీల్

ముగిసిన పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పాలిసెట్–2023 ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన సోమవారంతో ముగిసింది. చివరి రోజు 1,08,000 నుంచి చివరి ర్యాంకు వరకు పత్రాలు పరిశీలించారు. 319 మంది హాజరు కాగా, ఓసీ, బీసీలు 194, ఎస్సీ, ఎస్టీలు 125 మంది హాజరయ్యారు. గత నెల 29 నుంచి సోమవారం వరకు మొత్తం 2647 మంది హాజరయ్యారు. విద్యార్థుల ఆప్షన్ల ఎంపిక మంగళవారంతో ముగియనుంది. ఈ నెల 7న ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించారు. 9న అలాట్‌మెంట్లు ప్రకటిస్తారు. 15వ తేదీ నుంచి క్లాస్‌వర్క్ కొనసాగనుంది. కౌన్సెలింగ్ ప్రక్రియను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, ఇన్‌చార్జి మురళీకృష్ణ పర్యవేక్షించారు.

దరఖాస్తుల పరిశీలన తప్పనిసరి

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సమీప ప్రభుత్వ ఐటీఐల్లో దరఖాస్తుల పరిశీలనకు హాజరు కావాలని, పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులని ఎచ్చెర్ల ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ తెలిపారు. ఎచ్చెర్ల ఐటీఐలో ఆయన మాట్లాడుతూ ఐటీఐ ప్రవేశాలకు వెబ్‌సైట్ ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసేందుకు, దరఖాస్తు చేసుకున్నాక పరిశీలనకు హాజరయ్యేందుకు మంగళవారం చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ మంగళవారం ఐదు గంటల్లోపు సమీప ప్రభుత్వ ఐటీఐలు ఎచ్చెర్ల, శ్రీకాకుళం డీఎల్‌టీసీ, పలాసల్లో హాజరై దరఖాస్తులు పరిశీలించుకోవాలని, తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని చెప్పారు. దరఖాస్తుల పరిశీలనకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు తీసుకువెళ్లాలని అన్నారు.

ఏసీబీ సీఐ ఇంటిలో చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని అవినీతి నిరోధక శాఖ విభాగం (ఏసీబీ) సీఐ ఇంటిలో చోరీ జరిగినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్ట్స్ కళాశాల సమీపంలోని శాంతినగర్ కాలనీలో ఏసీబీ సీఐ హరి తన ఇంటిలో కుటుంబంతో కలిసి ఉంటున్నారు. ఆయన స్వగ్రామం సారవకోట సంబరాలు జరుగుతుండటంతో శనివారం కుటుంబంతో కలిసి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి వెనుక భాగం నుంచి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. అనుమానం వచ్చి బీరువా తెరిచి చూస్తే అందులో ఏడున్నర తులాల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనాస్థలికి సీఐ శ్రీనివాసరావుతో పాటు క్లూస్ టీమ్ వెళ్లి ఇల్లు, చుట్టుపక్కల పరిసరాలు పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

గ్రూప్–1 పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు



శ్రీకాకుళంలోని పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : గ్రూప్–1 పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జీఆర్ రాధిక పేర్కొన్నారు. ఆమె సోమవారం ఉదయం నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించి నిర్వహణ ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పరీక్ష కేంద్రాలకు ఇతరులను అనుమతించరాదని, అభ్యర్థులు తప్ప మిగిలిన వారెవరూ కేంద్రాల ఆవరణలో ఉండకుండా చూడాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రానికి అనుమతించరాదని దిశానిర్దేశం చేశారు.

టెక్కలి నుంచి విశాఖ, అరకు విహార యాత్రకు బస్సులు

టెక్కలి: ఆర్టీసీ ద్వారా విశాఖపట్టణం, అరకు ప్రాంతాల్లో విహార యాత్రలకు టెక్కలి నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 17 తేదీల్లో ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. భీమిలి బీచ్, తిరుమల తిరుపతి దేవస్థానం, కైలాసగిరి, అరకు, పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం, కాఫీ హౌస్, బొర్రా గుహలు తదితర ప్రాంతాలకు సర్వీసులు నడుపుతామని ఆయన పేర్కొన్నారు. రూ.2700ల చార్జీ వసూలు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9959225611, 7382923311 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దైవం వృక్ష రూపేణా..

- పాదయాత్ర ద్వారా పర్యావరణంపై ప్రచారం చేస్తున్న ఉత్తరప్రదేశ్ యువకుడు
- 2300 కిలోమీటర్లు నడిచి 1800 మొక్కలు నాటినట్లు ప్రకటన

నరసన్నపేట: భూమిని బతికించడానికి పర్యావరణ పరిరక్షణే దిక్కు అని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సుల్తాన్‌పూర్‌కు చెందిన అశుతోష్ పాండే అన్నారు. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు అయోధ్య నుంచి పాదయాత్ర చేస్తూ ఆదివారం రాత్రి నరసన్నపేటకు చేరుకున్నారు. సోమవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కను నాటి వీటిని సంరక్షించే బాధ్యతను వాకర్స్ క్లబ్ ప్రతినిధులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య నుంచి బెంగాల్, చత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రా, తెలంగాణ మీదుగా కన్యాకుమారి వెళ్లి అక్కడి నుంచి మళ్లీ అయోధ్య వరకు పాదయాత్ర చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 2300 కిలోమీటర్లు పాదయాత్ర చేసి 1800 మొక్కలు నాటానని, 210కి పైగా స్కూల్స్, కాలేజీల్లో విద్యార్థులను కలిసి పర్యావరణంపై అవగాహన కల్పించానని తెలిపారు. రూ.90వేలు జీతం వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి పాదయాత్రకు శ్రీకారం చుట్టానన్నారు. నరసన్నపేటకు వచ్చినప్పుడు స్థానిక వైశ్య సంఘం ప్రతినిధులు ఆశ్రయం కల్పించారన్నారు. మొక్కలను తాను దేవుడితో పోల్చుతానన్నారు.



లావేరు: బుడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పాదయాత్ర చేస్తూ నరసన్నపేటకు వచ్చిన అశుతోష్ పాండే



కాలేజీ గ్రౌండ్‌లో మొక్కను నాటి ప్రార్థిస్తున్న అశుతోష్ పాండే

● స్ఫూర్తిని చాటుదాం

అరసవల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచడంతో పాటు ఇతరత్రా పర్యావరణ హితమైన కార్యక్రమాలను చేపట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆమె మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యాలయం నుంచి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణాన్ని కాపాడాలంటూ ప్రతి ఒక్కరితో ప్రతిజ్ఞ చేయించారు.



డీఎంహెచ్‌ఓ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

● మొక్కలు నాటుదాం



మొక్కలు నాటుతున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కాలుష్య కోరల నుంచి పుడమిని కాపాడేందుకు అంతా మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. జిల్లా అటవీ శాఖ అధికారి నిషా కుమారి, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ కూడా పాల్గొన్నారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి నిషా కుమారి మాట్లాడుతూ..పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎస్.శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● మొక్కలతోనే మనుగడ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలని జిల్లా అటవీ అధికారి నిషాకుమారి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2023ను పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎస్.శంకర్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలిలో ఉదయం 7.30 గంటలకు ర్యాలీ నిర్వహించారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి నిషాకుమారి

● ఒకరికి ఒకరు..



ఒకరికి కళ్లు లేవు. మరొకరికి కాళ్లు పని చేయవు. వీరి బతుకు ముళ్ల బాటన వెళ్లకుండా మూడు ముళ్ల బంధంతో దేవుడు అందంగా ముడివేశాడు. ఆమె కడకొంగు ఆయనకు చేతి ఊతం. అతని గుండె చప్పుడు బిడ్డకు లాలి గీతం. పుట్టుకతో వచ్చిన లోపాలను సర్దుబాట్లతో అధిగమిస్తూ ఈ జంట అన్యోన్యంగా ఇలా ముందుకు వెళ్లడం పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కనిపించింది.

– కాశీబుగ్గ

కలెక్టర్ స్పందన@192

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఇన్‌చార్జి డీఆర్‌ఓ పి.మురళీకృష్ణ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. ఆయనతో పాటు ఉప కలెక్టర్ జయదేవి, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ కూడా వినతులను స్వీకరించారు. అనంతరం అన్ని శాఖలకు సంబంధించిన అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఈ వారం మొత్తం 192 వినతులు అందాయి. కార్యక్రమంలో భాగంగా ఒడిశాలోని బాలాసోర్ ట్రైన్ ప్రమాద మృతులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ ఈఈ శంకర నాయక్ పర్యావరణ పరిరక్షణపై అవగాహన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్, సర్వశిక్షా అభియాన్ ఏపీసీ జయప్రకాశ్ అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ఎస్పీ స్పందన@43

శ్రీకాకుళం క్రైమ్ : జగనన్నకు చెబుదాం స్పందనకు వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 43 అర్జీలు అందాయి. ఫిర్యాదుదారులు రాతపూర్వకంగా తమ అభ్యర్థనలను విన్నవించుకోగా, ఎస్పీ అర్జీదారులతో మాట్లాడి సత్వరమే సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదులు అందుకున్న వారిలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి ఉన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

మహసాహెబ్‌పేటలో 29 మందికి డయేరియా

కోటబొమ్మాళి: మండలం మహసాహెబ్‌పేట గ్రామంలో గత రెండురోజులుగా 29 మందికి డయేరియా వ్యాపించింది. బడ్డి రాజారావు, బర్ల లక్ష్మి, నక్కిర్ల భూలోకదు, సింగారి లక్ష్మి, ఈగల పాపారావు, కొర్రాయి లక్ష్మి, బర్ల శిమ్మయ్య, పులి లక్ష్మి, సంకిలి అప్పన, సింగారి లక్ష్మిలతో పాటు మరికొంత మందికి డయేరియా సోకింది. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమించడంతో కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో జరిగిన వివాహ విందు కారణంగా డయేరియా వ్యాపించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.గోపికృష్ణ, డాక్టర్ వరుణ్, 104 సిబ్బంది గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం రోగుల పరిస్థితి అదుపులోనే ఉందని కోటబొమ్మాళి ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.సుధారాణి తెలిపారు.



మహసాహెబ్‌పేటలో మెడికల్ క్యాంపు ఏర్పాటు

ఆదిత్యుని సన్నిధిలో
విశ్రాంత న్యాయమూర్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వచనాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ ఉన్నారు.

సూర్యనారాయణస్వామిని దర్శించుకున్న మైన్స్ శాఖ డైరెక్టర్

సూర్యనారాయణ స్వామి వారిని ఏపీ రాష్ట్ర భూగర్భ గనుల శాఖ డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఉదయం దర్శించుకున్నారు. వారికి ఈవో హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు శంకరశర్మలు స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. వేదపండితులచే ఆశీర్వచనాన్ని, శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రముఖ దేవస్థానమైన అరసవల్లి ఆలయంలో.. మరిన్ని అభివృద్ధి పనుల కోసం గ్రానైట్ సంఘాల వంతుగా గ్రానైట్‌ను ఉచితంగా అందజేస్తామని ప్రకటించారు. ఇందుకోసం త్వరలోనే ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా భూగర్భ గనుల శాఖాధికారి ఎస్.కె.వి. సత్యన్నారాయణ, టెక్కలి మైన్స్ ఏడీ ఫణిభూషణ రెడ్డి ఉన్నారు.



చంద్రయ్య, యతిరాజులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్, శంకరశర్మలు



వెంకటరెడ్డి, దువ్వాడలకు జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం

తెరగతి రెడీ

- జిల్లాలో తొలి దశలో 498 ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్య
- నాడు–నేడు ద్వారా సదుపాయాల కల్పన
- జిల్లాకు 452 స్మార్ట్ టీవీలు, 1044 ఐఎఫ్‌పీలు కేటాయింపు
- పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సౌకర్యం

సారవకోట: సర్కారు బడి డిజిటల్ మయమవుతోంది. సర్కార్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి రానున్నాయి. ఇన్నాళ్లు బ్లాక్ బోర్డులపైనే సాగిన బోధన ఇకపై స్మార్ట్ టీవీల్లోనూ జరగనుంది. విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా వినూత్నమైన డిజిటల్ బోధన ఈ విద్యా సంవత్సరంలో నుంచే అందుబాటులోకి తీసుకురానున్నారు.

తొలి దశలో..

జిల్లాలో తొలి దశలో 498 ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నారు. బైజూస్ సేవలను వినియోగించుకుంటూ ప్రారంభమయ్యే ఈ శిక్షణ కోసం 1 నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేస్తారు. 6 నుంచి 10వ తరగతి ఉండే పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ (ఐఎఫ్‌పీ)లను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 452 స్మార్ట్ టీవీలు, 1044 ఐఎఫ్‌పీలను అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంట్లో ప్రాథమికోన్నత పాఠశాలలకు స్మార్ట్ టీవీ, ఐఎఫ్‌పీలు అందజేయనున్నారు. అంతకంటే ముందు తరగతి గదిలో ప్రాథమిక సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. తరగతి గదిలో అవసరమైన ప్రాంతంలో విద్యుత్ సదుపాయం, పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం తదితర విషయాలపై సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను నాడు–నేడు ఎస్ఎంటీ యాప్‌లో పొందుపర్చాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు.


ఉపయోగం ఇలా..

తరగతి గదిలో ఉపాధ్యాయుని సమక్షంలో పాఠ్యాంశాలను దృశ్య వీక్షణ ద్వారా చూడడం విద్యార్థులకు గొప్ప అనుభూతిని పంచుతుంది. ఈ బోర్డును బ్లాక్ బోర్డులా ఉపయోగించవచ్చు. రాసిన దాన్ని చెరపవచ్చు. లేదా రాసిన విషయాన్ని సేవ్ చేసుకోవచ్చు. ఇంటర్నెట్ వినియోగించి కంప్యూటర్ మాదిరిగా వినియోగించవచ్చు. యూట్యూబ్, ఫోన్ లేదా ట్యాబ్‌లోని సమాచారం సైతం స్క్రీన్ పై చూసేందుకు అవకాశం ఉంది.



కొత్తూరు బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ

తరగతి గదిలో డిజిటల్ ప్రపంచం



ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో డిజిటల్ ప్రపంచాన్ని చూడవచ్చు. ఐఎఫ్‌పీలను బ్లాక్, వైట్ బోర్డులుగా వాడుకోవచ్చు. వాటికి ఫోన్లు కనెక్టు చేసుకుని ఫోన్లో ఉన్న మెటీరియల్‌ను చూడవచ్చు. సాంకేతికను జోడించి విద్యా బోధన చేయడం ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు లభిస్తాయి. సాంకేతిక పరికరాలను వినియోగిస్తూ ఉపాధ్యాయులు కీలక భూమిక పోషించినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

– సోపింటి జగదీష్, బైజూస్ నోడల్ అధికారి, శ్రీకాకుళం

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

పోలాకి: ఒడిశా బాలాసోర్ రైలు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన బాధితుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో చర్యలు చేపట్టారని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వారు కోలుకోవడానికి సత్వర చర్యలు ఏర్పాటు చేయటమే కాకుండా పరిహారాన్ని కూడా ప్రకటించి ఆదుకున్నారని చెప్పారు. మృతులకు రూ.10 లక్షలు, తీవ్రగాయాల పాలైన వారికి రూ.5లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష మంజూరు చేసి సీఎం తన మానవత్వాన్ని చాటుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. సహాయ పునరుద్ధరణ, వైద్య సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వ స్పందనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని తెలిపారు.

● కన్నీటి నివాళి



ఒడిశా రాష్ట్రం బాలాసోర్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు మృత్యువాత పడటంపై సైకత శిల్పి గేదెల హరికృష్ణ నివాళులర్పించారు. సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పం వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆమదాలవలస రూరల్:

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేస్తూ ఇటీవల మరణించిన వి.ప్రకాశరావు కుటుంబానికి సహోద్యోగులు అండగా నిలిచారు. ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఇలా సమకూరిన రూ. 4.23 లక్షల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అందజేశారు. ప్రకాశరావు కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) జె.తిప్పేస్వామి, పరిపాలనాధికారి సీహెచ్ గోపినాథ్, ఆర్ఐ ప్రదీప్ ఉన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అభినందన



అరుణకుమారిని అభినందిస్తున్న జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొడవలి అరుణ కుమారి ఆంధ్రా విశ్వవిద్యాలయంలో కెమిస్ట్రీలో డాక్టరేట్ పూర్తి చేశారు. ఈమెను శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు ప్రత్యేకంగా సోమవారం అభినందించారు. బోధనసిబ్బంది పరిశోధలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి



ర్యాలీలో పాల్గొన్న జీడి రైతులు

కాశీబుగ్గ: జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఇదే డిమాండ్‌తో పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ బస్టాండ్ మూడు రోడ్ల జంక్షన్ వరకు జీడి రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇవ్వడమే తప్ప ఆచరణకు నోచుకోలేదన్నారు. గతంలో 80 కిలోల జీడి పిక్కల బస్తా రూ.14 వేలు పలికేదని, ప్రస్తుతం రూ. ఎనిమిది వేలకు పడిపోవడం బాధాకరమన్నారు. పలాస జీడి వ్యాపారులు సిండికేట్‌గా మారి రాష్ట్రంలో జీడి వ్యాపారాన్ని శాసిస్తున్నారని ఆరోపించారు. పిక్కల ధర రోజురోజుకు తగ్గుతుంటే పప్పు ధర పెరగడం శోచనీయమన్నారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని కోరుతూ పలాస ఆర్డీవో సీతారామమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు, నాయకులు ఎస్.గణపతి, పుచ్చ దుర్యోధన, చాపర వెంకటరమణ, మద్దిల రామారావు, పి.కుసుమ, బి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో బదిలీల జాతర

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తీపికబురు
- రిక్వెస్ట్ బదిలీలకు ప్రభుత్వం అవకాశం
- జిల్లాలో 652 టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు లబ్ధి
- 12న జిల్లా కలెక్టర్ నేతృత్వంలో కౌన్సెలింగ్



కేజీబీవీ ఆమదాలవలస

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. అభ్యర్థనతో కూడిన బదిలీల (రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్)కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రెండేళ్ల వ్యవధిలో రెండోసారి బదిలీలకు అవకాశం కల్పించడంతో సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు చేస్తున్న వారికి గొప్ప అవకాశంగా భావిస్తున్నారు. దీంతో సమగ్రశిక్షా పర్యవేక్షణలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగా మరోసారి నిలుస్తారని వారంతా కొనియాడుతున్నారు.

652 మందికి లబ్ధి

ఉమ్మడి శ్రీకాకుళం (రాజాం, పాలకొండ నియోజకవర్గాలతో కూడిన) జిల్లాలో మొత్తం 32 కేజీబీవీలు ఉండగా.. వీటిల్లో 652 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో పీజీటీలు 62 మంది, ప్రిన్సిపాళ్లు 17 మంది, పీఈటీలు 30 మంది, సీఆర్టీలు171 మంది, ఇతర నాన్‌టీచింగ్ సిబ్బంది 372 మంది పనిచేస్తున్నారు. ఈ లెక్కన ప్రభుత్వం తీసుకున్న రిక్వెస్ట్ బదిలీలతో వీరంతా లబ్ధి పొందే అవకాశం ఉంది.

7వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు రిక్వెస్ట్ బదిలీల కోసం ఈనెల ఐదో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవ్వగా ఏడో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించారు. అయితే సమగ్రశిక్షా పథకం జిల్లా కార్యాలయంలో నేరుగా అందజేసిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర అధికారులు ఆదేశించారు. ఏడో తేదీలోపు దరఖాస్తులు చేసిన ఉద్యోగినులను మాత్రమే బదిలీలకు అర్హులుగా భావిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ఈనెల 12వ తేదీన జిల్లా కలెక్టర్ నేతృత్వంలో కౌన్సెలింగ్ జరిపి బదిలీలను పూర్తి చేయనున్నారు.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో మొత్తం కేజీబీవీలు	32
పనిచేస్తున్న ఉద్యోగులు	652
పీజీటీలు	62 మంది
ప్రిన్సిపాళ్లు	17 మంది
పీఈటీలు	30 మంది
సీఆర్టీలు	171 మంది
బోధనేతర సిబ్బంది	372 మంది

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేజీబీవీల్లోని ఉద్యోగులకు ప్రభుత్వం మేలు చేసేలా మరోసారి నిర్ణయం తీసుకుంది. రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం ఇవ్వడం శుభపరిణామం. కలెక్టర్ ఆదేశాలు, సూచనల మేరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా యూనిట్‌గా భావించి బదిలీల ప్రక్రియ చేపట్టనున్నాం. ఈ నెల ఏడో తేదీలోగా నేరుగా జిల్లా కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నవారినే అర్హులుగా పరిగణిస్తాం. ఈనెల 12వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేపడతాం.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్షా ఏపీసీ, శ్రీకాకుళం జిల్లా

కొలువు పేరిట టోకరా

- నిరుద్యోగుల నుంచి రూ. 24 లక్షలు కొట్టేసిన పోలీస్ కానిస్టేబుల్
- నాలుగేళ్లుగా ఎస్పీ స్పందనలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు
- తాజాగా 1902 నంబర్‌కు కాల్ చేసి విన్నవించిన వైనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఇప్పిస్తానంటూ ఓ పోలీస్ కానిస్టేబుల్ ఆరుగురు నిరుద్యోగులకు నమ్మబలికి రూ. 24 లక్షలకు టోకరా వేశాడు. ఇది జరిగింది 2019 సంవత్సరం ఆగస్టులో. ఇంత వరకు ఈ కేసు ఓ కొలిక్కి రాలేదు. బాధితులు శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్, ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌తో పాటు స్పందనకు కూడా ఐదుసార్లు వెళ్లారు. చివరి సారిగా ఎస్పీ రాధిక రూరల్ సీఐ లెంక సన్యాసినాయుడుతో మాట్లాడి డిలే ఎఫ్ఐఆర్‌ను ఎస్ఐ బలివాడ గణేష్‌తో వేయించారు. ఇప్పుడు వారు 1902కు ఫోన్ చేసి మళ్లీ ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు..

శ్రీకాకుళం రూరల్ మండలంలోని వాకలవలస గ్రామానికి చెందిన కంచరాన పుణ్యవర్ధనరావు, చింతాడ సురేష్, పేడాడ లక్ష్మణరావు, తమ్మినేని మణితేజ, పొందూరు మండలం కింతలి గ్రామానికి చెందిన ఎన్ని హేమసుందర్, ఆమదాలవలస మండలం పొన్నంపేట గ్రామానికి చెందిన ఇప్పిలి శశికుమార్‌లు 2019 ఆగస్టులో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కోలా రాజును కోర్టు ఉద్యోగాల కోసం సంప్రదించా రు. అప్పట్లో అంతా కలిసి ఆయనకు రూ.24 లక్షలు ఇచ్చారు. ఫోన్‌పే ద్వారా చేతికి నగదు అందించారు. అయితే డబ్బు తీసుకున్నాక ఎవరికీ ఉద్యోగం రాలేదు. దీంతో వారు 2020లో పోలీసులను ఆశ్రయించారు. అప్పటి నుంచి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఓరల్ ఎంక్వైరీ కూడా 2022లో చేసినా కేసు తేలలేదు. దీంతో వారు సోమవారం 1902 నంబర్‌కు డయల్ చేసి మళ్లీ ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ తమ డబ్బు తిరిగి ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని, అతడిని పోలీసులు అరెస్టు చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఎలుగు దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం వాసులను ఎలుగులు భయపెడుతూనే ఉన్నాయి. తాజాగా అక్కుపల్లిలో సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన సూరాడ లోకనాథంపై ఎలుగు దాడి సంఘటనతో ఉద్దానం మళ్లీ ఉలిక్కిపడింది. జీడి పంటపై ఆధారపడిన రైతులు చివరి దశలో ఉన్న పిక్కలను సేకరించేందుకు తోటలకు వెళ్తున్నారు. అలా వెళ్లిన లోకనాథం ఎలుగు దాడికి గురయ్యాడు. బాధితుడు కేకలు విన్న గ్రామస్తులు హుటాహుటిన రావడంతో ఎలుగు పరారైంది. దీంతో ప్రాణాపాయం తప్పింది. క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మండల తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఆర్ఐ పవిత్ర, పలువురు ఉద్యోగులు ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

మిలీనియం మిత్రుల అ'పూర్వ' కలయిక



ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మందస: వారంతా చిన్ననాటి స్నేహితులు. 1995 నుంచి 2000వ సంవత్సరం వరకు శ్రీరాజా శ్రీనివాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం 2002 వరకు ఇంటర్‌మీడియెట్‌ను మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. వృత్తి, ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. రెండు వేల సంవత్సరానికి గుర్తుగా మిలీనియం మిత్రుల పేరిట ఇప్పటికే సమాజహిత కార్యక్రమాలు చేస్తున్నారు. వారంతా సోమవారం మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనందంగా నృత్యాలు చేశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు పూర్వ విద్యార్థులతో కలసి, మెలసి యాంకర్‌గా వ్యవహరించారు. తమకు విద్యను నేర్పిన అధ్యాపకులకు సన్మానించారు. ఈ సందర్భంగా మిలీనియం మిత్రులు మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తులు, పేద, ఆపదలో ఉన్నవారు, సహాయార్థులకు రూ.7 లక్షలు అందజేయడం జరిగిందన్నారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

డాక్టర్ రెడ్డీస్‌కు పర్యావరణ అవార్డు



మంత్రి రామచంద్రారెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న రెడ్డీస్ ప్రతినిధులు

రణస్థలం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పైడిభీమవరం పారిశ్రామికవాడలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ (సీటీవో-6)కు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రతిష్ఠాత్మకమైన పర్యావరణ ఎక్సలెన్స్ 2023 అవార్డు ప్రకటించింది. ఈ అవార్డును విజయవాడలోని ఏపీ ఇంధన, పర్యావరణ, అటవీ, శాస్త్రసాంకేతిక, గనులు, భూగర్భ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా డాక్టర్ రెడ్డీస్ ప్రతినిధులు సీటీవో-6 సైట్ హెడ్ ధర్మేష్ పంచాల్, కార్పొరేట్ వ్యవహారాల లీడ్ కేవీఎస్ ఎస్ రాజ్, సేఫ్టీ హెల్త్ అండ్ ఎన్విరాన్మెంట్ లీడ్ ఎస్. శ్రీధర్‌లు అందుకున్నారు. మురుగునీటి నిర్వహణ, ఇంధన పరిరక్షణ, ఇతర అత్యుత్తమ పర్యావరణ పద్ధతులతో సహా డాక్టర్ రెడ్డీస్ అనుసరిస్తున్న వివిధ సుస్థిరత పద్ధతులను పర్యావరణ అధికారులు ఇటీవల పరిశ్రమకు వచ్చి అధ్యాయనం చేశారని రెడ్డీస్ ప్రతినిధులు తెలిపారు. జీరో లిక్విడ్ డిశ్చార్జ్ అనే ప్రత్యేక విధానాన్ని కూడా ఆధికారులు పరిశీలించడం జరిగిందని చెప్పారు. ఈ అంశాలన్నీ క్రోడీకరించి పర్యావరణ అవార్డును ప్రభుత్వం ప్రకటించడం పట్ల పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

- వినియోగదారులు సంతృప్తిగా ఉండేలా చూడండి
- అంతరాయాలు తగ్గించడంపై దృష్టిపెట్టండి
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



స్టోర్స్‌లో పనులపై ఆరా తీస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

అరసవల్లి: నివేదికల్లో అంకెలు చూస్తే ఫర్వాలేదనిపిస్తోంది..అయితే శ్రీకాకుళం జిల్లా నుంచే అధికంగా విద్యుత్ అంతరాయాలపై ఆన్‌లైన్ ఫిర్యాదులు వస్తున్నాయని.. వీటిపై ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారంటూ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తొలిసారిగా జిల్లాలో సోమవారం పర్యటించిన ఆయన ముందుగా జిల్లా కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లా నుంచే ఫిర్యాదుల సంఖ్య అధికంగా ఉందని..ఇందుకు క్షేత్ర స్థాయిలో మీరు పరిష్కరించకపోవడంతోనే కార్పొరేట్ కార్యాలయం వరకు చేరుతున్నాయని మండిపడ్డారు. విద్యుత్ శాఖకు వినియోగదారుడి సంతృప్తే ప్రధానమన్నారు. ముందుగా వినియోగదారుల ఫోన్ కాల్స్‌ను సవ్యంగా రిసీవ్ చేసుకోవాన్నారు. అలాగే స్టాండర్డ్స్ ఆఫ్ పెర్ఫార్మెన్స్ (ఎస్‌వోపీ) ప్రకారం కచ్చితంగా వినియోగదారునికి సేవలందించాలన్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, కొత్త సర్వీసుల రిలీజ్‌లు వంటి బియాండ్ రిసాల్వింగ్ టైమ్ (బీఆర్‌టీ) కేసులు తగ్గించడం ద్వారా విద్యుత్ సేవలపై వినియోగదారుల్లో సంతృప్తి పెరుగుతుందన్నారు. విద్యుత్ అంతరాయాలు తగ్గించాలని, 11 కేవీ ఫీడర్లు, 33 కేవీ లైన్లలో అధికంగా అంతరాయాలు వస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. విద్యుత్ వినియోగదారుడి కనెక్షన్ ఏ ఫీడర్ మీద ఉందో (కన్జ్యూమర్ ఇన్‌డెక్సింగ్) ఇప్పటివరకు సక్రమంగా లేదని.. ఈనెల పదో తేదీలోగా క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని గుజరాతీపేట వద్ద 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం ప్రతిపాదనలపై ఎస్ఈ దైవప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు.

తీగలు అల్లేస్తున్నా పట్టించుకోరా?

ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న స్టోర్స్ విభాగాన్ని సీఎండీ పృథ్వీతేజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు చోట్ల విద్యుత్ వైర్లకు తీగలు అల్లేసుకోవడాన్ని చూసి ఇలా. మన కార్యాలయంలోనే ఉంటే పట్టించుకోరా అని సిబ్బందిని ప్రశ్నించారు. ఇదే ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోతే ఎలా అక్కడి అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఎచ్చెర్ల మండలం పొన్నాడలోని జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 711 లేఅవుట్ల పరిధిలోని హౌసింగ్ కాలనీల్లో విద్యుత్ పనులు ప్రారంభిస్తే కేవలం 179 లేఅవుట్లలోనే పనులు పూర్తిగా చేశారా..ఇదేం ప్రగతి అంటూ ఎస్ఈని నిలదీశారు. రానున్న తొమ్మిది నెలలు కీలకమని, ప్రతి అధికారి చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. సీఎండీ వెంట ఈపీడీసీఎల్ డైరెక్టర్ రమేష్ ప్రసాద్, జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) తిలక్, సీజీఎం శ్రీనివాసరావు ఉన్నారు.

అతిసార నియంత్రణకు కృషి

- డీఎంహెచ్‌వో మీనాక్షి



ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

ఎచ్చెర్ల: అతిసార వ్యాధి నియంత్రణకు వైద్యసిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యాధికారిణి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అతిసారవ్యాధి, ఉధృత నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా జింక్, ఓఆర్ఎస్ కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో నియమించిన ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి జింక్, ఓఆర్ఎస్ పంపిణీ చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధిక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధకటీకాల అధికారి ఆర్‌వీఎస్ కుమార్, స్థానిక వైద్యులు ముద్దాడ దీప, జగన్నాథరావు పాల్గొన్నారు.

విద్యుత్ వాహనాలతో పర్యావరణానికి మేలు

- ఇన్‌చార్జి డీఆర్వో మురళీకృష్ణ



విద్యుత్ వాహనాలు పరిశీలిస్తున్న మురళీకృష్ణ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యుత్ వాహనాల వినియోగంతో పర్యావరణానికి మేలు చేసినవాళ్లమవుతామని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో స్పందన విభాగం వద్ద నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల ప్రదర్శనను ఆయన సందర్శించారు. విద్యుత్ వాహనాలను పరిశీలించి వాటి పనితీరు, ధరల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో వాతావరణ కాలుష్య నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. వీలైనంత ఎక్కువగా విద్యుత్ వాహనాలను ఉపయోగించి వాతావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ ఇందన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పర్యావరణ హితానికి విద్యుత్‌తో నడిచే వాహనాలు దోహదపడతాయన్నారు.

యునైటెడ్ పాస్టర్స్ అండ్ లీడర్స్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం

టెక్కలి: జిల్లా యునైటెడ్ పాస్టర్స్ అండ్ లీడర్స్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. టెక్కలిలోని మన్నా చర్చిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పి.కృపానందం, కార్యదర్శిగా కె.వి.సాల్మన్, కోశాధికారిగా ఎస్.విచిత్రో, ప్రతినిధులుగా పి.ప్రసాద్, కె.రవికుమార్, విజయరాజు, విజయకుమార్‌తో పాటు వంద మందితో కార్యవర్గాన్ని నియమించారు.

నేటి నుంచి ఏపీ పీజీ సెట్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పీజీసెట్-2023 మంగళవారం నుంచి మొదలుకానుంది. ఆన్‌లైన్ పద్ధతిలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో మూడు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు నోటిఫికేషన్ నిబంధన, పరీక్షల షెడ్యూల్ మేరకు హాజరుకావాల్సి ఉంటుంది. 6వ తేదీన ఇంగ్లిష్, బోటనీ, మ్యాథమేటికల్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, 7వ తేదీన తెలుగు, లైఫ్ సైన్సెస్, కామర్స్, ఎలక్ట్రానిక్స్, 8వ తేదీన కెమికల్ సైన్సెస్, హిస్టరీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, ఎడ్యుకేషన్, 9వ తేదీన జువాలజీ, కంప్యూటర్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్సెస్, సెరికల్చర్, జియోలజీ, 10న ఫిజికల్ సైన్సెస్, సైకాలజీ పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాల్లో పీజీ సెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కలిప్తారు. జిల్లా విద్యార్థులు కొందరికి విజయనగరం జిల్లా జీఎంఆర్ కళాశాల పరీక్ష కేంద్రం సైతం కేటాయించారు. కన్వీనర్‌గా ఏయూ ప్రొఫెసర్ సీహెచ్‌వీవీఎస్ భాస్కర రెడ్డి వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు సమాచారం కోసం ఫోన్ నంబర్ 0891 2719544 ను సంప్రదించవచ్చు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నలుగురు ఎంపిక

ఇచ్ఛాపురం: బెంగళూరులో జూలై నెలలో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన నలుగురు ఎంపికై నట్లు స్కూల్‌ఆఫ్ తైక్వాండో ఇచ్ఛాపురం కోచ్ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. శని, ఆదివారాల్లో విజయనగరం జిల్లా కొత్తవలస గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-24 విభాగంలో పి.దమయంతి, క్యాడెట్ విభాగంలో సీహెచ్ గిరి, ఎ.రేవంత్, సాడి జయరామ్ బంగారు పతకాలు సాధించడం ద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన వారితో పాటు సిల్వర్ మెడల్స్ సాధించిన కృతజ్ఞ, సీహెచ్ చందు, ఎస్.భగవాన్, బ్రాంజ్ మెడల్ సాధించిన ధర్మతేజలకు స్కూల్ ఆఫ్ తైక్వాండో ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పిలక విజయ్‌భాస్కర్‌రెడ్డి, కె.దిలీప్, బి.కృష్ణయ్య పాల్గొన్నారు.

శిరీష ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా నుంచి ముద్దాడ శిరీష ఎంపికైంది. ఈ పోటీలు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్ వేదికగా ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జరగనున్నాయి. ఆమె సోమవారం ఇక్కడి నుంచి పయనమై వెళ్లింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆమెను అభినందించడంతోపాటు వీడ్కోలు పలికారు. జాతీయ పోటీల్లో పతకం సాధించి జిల్లాకు, రాష్ట్రానికి వన్నె తీసుకురావాలిలని పలువురు ఆకాంక్షించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, ఇంటర్నేషనల్ వాకర్స్ మాజీ గవర్నర్ గేదెల ఇందిర ప్రసాద్, డీఎస్ఏ సీఈవో బీవీ ప్రసాదరావు, చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, ఉషా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, తైక్వాండో కోచ్‌లు కురిటి తారక రామ, రెడ్డి సాయిరాం తదితరులు పాల్గొన్నారు. శిరీష జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుతరెడ్డి హర్షం వ్యక్తం చేశారని భాస్కరరావు చెప్పారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,330–00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,300–00
వెండి (కిలో)	77,700–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ.519.00
శ్రీకాకుళం	రూ.519.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹ 284